

పైప్‌లైన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణారెడ్డి

డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. గురువారం సైదాబాద్ డివిజన్ తిరుమల హిల్స్, శంకేశ్వర్‌బజార్, ధోబీఘాట్ ప్రధాన రహదారిపై రూ.73.07 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముఖ్యంగా బస్తీలతో పాటు పలు కాలనీల్లో లోప్రెషర్ నీటి సరఫరా సమస్యలు ఉన్న ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కొరుడు భూమేశ్వర్, ధర్మరాజు, మాజీ వార్డు సభ్యుడు నర్సింహ, జలమండలి డీజీఎం అస్మత్‌అలీ, మేనేజర్ శ్రవణ్, సూపర్‌వైజర్ మనోహర్, రమేష్ పాల్గొన్నారు.



ట్రెయిన్ ట్రస్టులో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ట్రెయిన్ ట్రస్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో బుధవారం ప్రారంభించిన ట్రెయిన్ ట్రస్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన వర్గాల ప్రజలకు, వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం హయత్‌నగర్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 45రోజుల పాటు శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ట్రస్టుకు తన సంపూర్ణ సహకారాలు అందిస్తానని అన్నారు. ట్రస్టు సీఈవో అమిషాప్రభు పాల్గొన్నారు.

ప్రజల్లో దేశభక్తిని పెంచడమే లక్ష్యం

మన్సూరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'హర్ ఘర్ తిరంగా - తిరంగా యాత్ర' కార్యక్రమం ద్వారా ప్రజల్లో దేశంపై భక్తిని మరింతగా పెంచడమే తమ లక్ష్యమని కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేటర్ విజయశ్రీతులసి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం 'హర్ ఘర్ తిరంగా-తిరంగా యాత్ర'పై జిల్లాస్థాయి నాయకులతో కార్యశాల నిర్వహించారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయశ్రీతులసి విచ్చేసి ప్రసంగించారు. కార్యశాలలో నాయకులు బండారి భాస్కర్, బొల్లం యశ్పాల్‌గౌడ్, నందికొండ గీతారెడ్డి, కొప్పర శ్యామల, డివిజన్ పార్టీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, జయప్రకాశ్, రవీందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శివారు కాలనీలకు నిధులు మంజూరు చేయండి

హయత్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్‌నగర్ డివిజన్ నగరానికి శివారులో ఉండడం వల్ల రోజు రోజుకు కొత్త కాలనీలు పుట్టుకు వస్తున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని అనేక మంది తనను కోరుతున్నారని తెలిపారు. శివారు కాలనీలను దృష్టిలో పెట్టుకుని కమిషనర్ ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

వినాయకచవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

ఎల్‌బీనగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న వినాయకచవితి నవరాత్రులు, నిమజ్జనోత్సవాలకు తగు ఏర్పాట్లు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు జోనల్ కమిషనర్‌ను కోరారు. గురువారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ కృష్ణకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి కన్వీనర్ జీ. నవీన్‌కుమార్ మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకుని వాడవాడలా వినాయక మండపాలను ఏర్పాటు చేస్తారని మండపాల వద్ద పారిశుధ్యం, భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారులపై గుంతలు లేకుండా ప్యాచ్‌వర్క్ చేయించాలన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు సిల్వేరి అనీల్‌కుమార్, బ్రహ్మచారి, లక్ష్మి, ప్రసాద్, కౌశిక్, సంతోష్ పాల్గొన్నారు.

పరిసరాలను కాపాడుకోవడానికి మొక్కలు నాటాలి

వనస్థలిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పరిసరాలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సలహాదారులు, డిప్యూటీ రేంజ్ అధికారి మహమ్మద్ రఫీ ఉద్దీన్ ఆధ్వర్యంలో 250 మెడిసినల్ మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్‌ఓ కసనానాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.వి దినేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే ఆస్పత్రుల లక్ష్యం

వనస్థలిపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ఆస్పత్రుల లక్ష్యమని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ అన్నారు. గురువారం వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎన్‌బీఎస్‌యూలో డబుల్ సర్ఫేస్ ఫొటోథెరపీ యూనిట్లను డాక్టర్ నాగేందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ జయమాల, పిడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ అనిత, డాక్టర్లు అనిత ఉమాశంకర్, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

సింగరేణి ఆఫీసర్స్‌కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో డీసీ మంగతాయారు, కార్పొరేటర్

సైదాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి ఆఫీసర్స్‌కాలనీలో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-7 డీసీ మంగతాయారు పర్యవేక్షణలో గురువారం మాన్‌సూన్ శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తకుప్పలు, మట్టికుప్పలు, చెట్లకొమ్మల తొలగింపు కోసం చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి పరిశీలించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హర్టికల్చర్ ఎంటమాలజీ, శానిటేషన్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

దళారుల చేతిలో రేషన్‌కార్డుల మంజూరు వ్యవస్థ

ఎల్‌బీనగర్ : నిరుపేద ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తూ ఉన్న రేషన్‌కార్డుల మంజూరు వ్యవస్థ దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సరూర్‌నగర్ ఏఎస్‌ఓ పుల్లయ్యను కలిసిన ఆమె మాట్లాడుతూ స్వరాష్ట్రంలో రేషన్ కార్డులు పొందుతామన్న ఆశతో ఎదురుచూసిన ప్రజలకు పదేళ్ల పాటు నిరాశే మిగిలిందన్నారు. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులపై తీపికబురు చెప్పినట్లే చెప్పి తీరా రేషన్‌కార్డుల మంజూరు విషయంలో పారదర్శకత లేకపోవడం వల్ల దళారీ వ్యవస్థ ఆక్రమించిందన్నారు. దీంతో అర్హులకు మాత్రం ఎదురుచూపులే మిగులుతున్నాయన్నారు.



విజయవాడ జాతీయ రహదారిపై వనస్థలిపురం సుష్మాచౌరస్తాలో నిలిచిన వరదనీరు



మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తిన వరద ప్రవాహంలో నుంచే వాహనాల రాకపోకలు



మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద ట్రాఫిక్ జామ్



హయత్‌నగర్ రాఘవేంద్రనగర్ కాలనీలో వర్షం నీటితో నిండిన రోడ్డు

కుండపోత వర్షం

● ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు

● మలక్‌పేట పోచమ్మగుడిలోకి వరదనీరు, మునిగిన కార్లు

ఎల్‌బీనగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గురువారం పగలంతా ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రానికి చల్లబడింది. ఉన్నట్టుండి సాయంత్రం 6.40గంటలకు కుండపోతగా వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా వర్షం జోరుగా కురవడంతో రోడ్లపై ఎక్కడ చూసినా వరదనీటి ప్రవాహ మే, సాయంత్రం ఆఫీసుల నుండి ఇళ్లకు చేరుకుందామని రోడ్డెక్కిన ప్రజలకు వర్షం నరకం చూపించింది. ట్రాఫిక్ స్తంభించి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సరూర్‌నగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, కర్మన్‌ఘాట్, ఎల్బీనగర్, వనస్థలిపురం, నాగోల్, మన్సూరాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సరూర్‌నగర్ చౌడి శివాలయం వ ద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండి వర్షం నీరంతా శివాలయంలోకి వచ్చిచేరింది. కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి జీహెచ్ఎంసీ సిబ్బంది సాయంతో మ్యాన్‌హోల్‌లు తెరిచి నీటి మళ్లించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు.

మలక్‌పేటలో వరద బీభత్సం

చాదర్‌ఘాట్ : కుండపోతగా కురిసిన భారీ వర్షం కారణంగా మలక్‌పేటలోని రోడ్లపై వరద బీభత్సం సృష్టించింది. దాదాపు గంట పాటు కురిసిన వర్షానికి వరదతో నిండిపోయాయి. మోకాలి లోతు వరకు



పోచమ్మఆలయం వద్ద వరదలో కొట్టుకుపోతున్న టీ కొట్టు డబ్బా

మూసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలో, గడ్డిఅన్నారం పీ అండ్ టీ కాలనీ రోడ్లు, న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ మెయిన్ రోడ్డు, మూసారాంబాగ్ బస్తీలోకి చేరడం తో స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వరద ప్రవాహం కారణంగా ఒకదశలో వాహనాలు రాకపోకలు సాగించలేకపోయాయి. రోడ్ల పక్కన పా ర్క్ చేసిన వాహనాలు వరదనీటిలో మునిగిపోయాయి. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వాహనాల రాకపోకలకు ఏర్పడిన అంతరాయంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

కొత్తపేటకాలనీల దారులను ముంచెత్తిన వరద

కొత్తపేట: కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల దారులను వరద నీరు ముంచెత్తింది. సత్యానగర్ రోడ్ నెం.14లో ఉండే ప్రైవేటు ఉద్యోగి ప్రమోద్‌మార్ ఇంట్లోకి వరదనీరు చేరడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బృందావన్ కాలనీని వరద నీరు ముంచెత్తింది. కొత్తపేట -నా గోల్ దారిలో గల



శాలివాహననగర్ కాలనీలో వరద ప్రవాహంలో మునిగిన వాహనాలు

మోహన్‌నగర్, ప్రజల, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమీపంలోని లోతట్టు కాలనీల్లోకి వరద నీరు చే రింది. నాగేశ్వర్‌నగర్‌కాలనీ, గాయత్రీపురం, ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీల దారుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. హయత్‌నగర్ హైకోర్టుకాలనీ గుండా వచ్చిన వర్షం నీరు బీడీఎల్ కాలనీ నుంచి హయత్‌నగర్ బస్ డిపో వద్దకు చేరుకుంది. రాఘవేంద్రనగర్ కాలనీ ఫేజ్-2 రోడ్డుపైన అడుగులోతు నీరు చేరింది. వర్షం దాదాపు గంట పాటు కురిసింది. ఆర్టీసీ మజ్దూర్‌కాలనీ, తిరుమలకాలనీ, వినాయకనగర్, పద్మావతికాలనీలోని లోతట్టు ప్రాంతాలకు భారీ వరద చేరింది.

వనస్థలిపురం: వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో మోస్తారు వర్షం కురిసింది. ఈ మేరకు పలు



ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు రోడ్లపై నిలవడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు కాలనీల్లో వర్షపు నీరు డ్రైనేజీలో చేరడంతో డ్రైనేజీలు పొంగిపొర్లాయి.

చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో ఉరుములతో కూడి న వర్షం కురిసింది. ఆయా డివిజన్లలో కాలనీలు వరదనీటితో జలమయం అయినవి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం నీటితో చంపాపేట చౌరస్తాలోని సాగర్ ప్రధాన రహదారిపై డీమార్టు ముందు వరదనీరు ప్రవహించడంతో వాహనదారులకు కొంత ఇబ్బంది ఏర్పడింది.

ఓల్డ్‌మలక్‌పేట: భారీ వర్షానికి ఓల్డ్‌మలక్‌పేట జలమయమైంది. పోచమ్మ ఆలయంలోకి వరదనీరు చేరింది. దేవాలయం చౌరస్తాలో కార్లు మునిగేంత వరద ప్రవాహం వచ్చింది. పైప్రాంతాల నుంచి వచ్చే వరద ఉధ్రితికి రోడ్లమీద పెట్టిన ఫుడ్‌పాయింట్, టీకొట్టు డబ్బాలు వరదలో చౌరస్తా వద్దకు కొట్టుకొచ్చాయి. రిలయన్స్ మార్ట్ సందు నుంచి వరద మున్సిపల్ కాలనీలో ఇండ్లలోకి చేరింది. లోతట్టు ప్రాంతాలు, అంబేద్కర్ చౌరస్తా, శంకర్‌నగర్, వాహెద్‌నగర్‌లలో వరద ముంచెత్తింది. రేస్‌కోర్సు రోడ్డులో నిన్న కుంగిన మ్యాన్‌హోల్ ప్రాంతం మొత్తం జలమయంగా మారింది.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లో విద్యుత్ అధికారుల బస్తీబాట

చాదర్‌ఘాట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఇక నుంచి ప్రతి బుధవారం విద్యుత్ అధికారుల బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లోని చంచల్‌గూడ, సంతోష్‌నగర్, ఆస్మాన్‌ఘడ్ ఏడీఈలు శోభన్, పవన్, వినోద్‌రెడ్డి ఏఈలు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, సత్యనారాయణ, సోహెల్, ప్రసాద్, భాస్కర్, సంతోష్, సుశాంక్, గోవింద్‌రావు, శ్రీనివాస్, రాకేష్‌లతో కలిసి విద్యుత్ సెక్షన్ల వారీగా బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ సమస్యలకు కారణాలను గుర్తించి వాటిని అప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు మరికొన్నింటిని వారం, పది రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ ఆదేశాల మేరకు విద్యుత్ బస్తీ బాట కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించి గురువారం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన వివరించారు. చాదర్‌ఘాట్ సెక్షన్‌లోని కమల్‌నగర్, చంచల్‌గూడ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించి కేబుల్ సమస్యలను గుర్తించి అప్పటికప్పుడు కొన్నింటిని పరిష్కరించారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం

ఓల్డ్‌మలక్‌పేట : తల్లిపాలు శిశువులకు అమృతంతో సమానమని అప్పుడే పుట్టిన శిశువుకు ముందుగా తల్లి ముర్రుపాలే పట్టించాలని మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి మహిళలకు సూచించారు.గురువారం మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మహిళలకు, గర్భిణులకు, చిన్నపిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ రామేశ్వరి, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం

కొత్తపేట : నిరంతరం విద్యాసంస్థల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని రాచకొం డ టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి అన్నారు. గురువారం ఎల్బీనగర్ మన్సూరాబాద్ జడ్పీహైస్కూల్ నుండి 47 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్పీఓ అమరవర్ధన్‌రెడ్డి, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

మద్యంమత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరం

కొత్తపేట : మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని మద్యంప్రియులు గుర్తించాలని టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి, ఎస్పీఓ అమరవర్ధన్‌రెడ్డి సూచించారు. రాచకొండ పరిధిలో మద్యంతాగి వాహనాలు నడిపి తనిఖీల్లో పట్టుబడిన మద్యంప్రియులకు గురువారం టీటీఐ లెక్చర్ హాల్‌లో డీడీ కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌కు కుటుంబ సభ్యులతో 47 మంది మద్యంప్రియులు హాజరయ్యారు.

ఘనంగా జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో శాంతినికేతన్ హైస్కూల్ సౌజన్యంతో గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌లోని గాంధీయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు చేనేత కార్మిక కుటుంబాలను ఘనంగా సన్మానించారు. చేనేతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాట్నంపై నూలు వడకడం లాంటి పనులను ప్రత్యక్షంగా విద్యార్థులకు చూపించారు. అనంతరం గాంధీ సంస్థల వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వదేశీ దుస్తులైన చేనేత, ఖాధి వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించాలని అన్నారు. కార్యక్రమంలో గాంధీ సంస్థల ఆర్గనైజింగ్ సెక్రెటరీ మెరుగు మధు, గిరిధర్‌గౌడ్, సంజయ్‌రెడ్డి, రవితేజారెడ్డి, శాంతినికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వరూపారాణి, పనిశ్రీ, ప్రభంజని, రామాంజనేయులు, సంతోష్ రెడ్డి, యానాల రాధిక పాల్గొన్నారు.



నేత కార్మికుల కుటుంబాలను సన్మానించిన గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి

సిందూర్ ఎన్‌క్లేవ్ సమస్యలు పరిష్కరించండి

మన్సూరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సిందూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ టవర్స్ వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిందూర్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయం వద్ద గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈడబ్ల్యూఏ అధ్యక్షుడు అనంతరాములు మాట్లాడుతూ సిందూర్ ఎన్‌క్లేవ్ పరిసరాల్లో రాత్రివేళల్లో పోలీసుల పెట్రోలింగ్, తమ కాలనీకి వెళ్లే 60 ఫీట్ల రోడ్డును జాతీయ రహదారికి అనుసంధానం చేయాలని, ఆ రోడ్డు వద్ద చిరువ్యాపార సముదాయాలు తొలగించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎల్బీనగర్ పీఎస్ నుంచి చింతల్‌కుంట వరకు రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించాలని, ఎల్‌పీటీ మార్కెట్‌కు ఎదురుగా ఉన్న బస్టాప్‌ను వేరేచోటుకి తరలించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ శనివారం ఆ ప్రాంతాన్ని స్వయంగా తానే వచ్చి సమస్యలు పరిశీలించి పరిష్కారానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చినట్లు రాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈడబ్ల్యూఏ ప్రధాన కార్యదర్శి జె.విజయసారథి, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి కేఎం రెడ్డి, సభ్యులు కె.పరమేశ్వర్, శివకుమార్, సందీప్‌గౌడ్, చక్రధర్‌రెడ్డి, మధుసూదన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో చంద్రమోహన్‌రెడ్డి ప్యానల్ విజయం

చంపాపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో గురువారం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌కు స్థానిక కమ్యూనిటీహాల్‌లో ఎన్నికలు నిర్వహించారు. సొసైటీలో 580 ఓట్లు ఉన్నాయి. హోరాహోరీ పోరులో గౌని చంద్రమోహన్‌రెడ్డి ప్యానల్‌లోని 9మంది మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు గోపాలక్రిష్ణారావు ప్యానల్‌పై ఘన విజయం సాధించింది. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా గౌని చంద్రమోహన్‌రెడ్డి, ఆమనగంటి జగత్‌రెడ్డి, చిట్టిప్రోలు రామునేత, గురువారెడ్డి, డి.సుధీర్‌రెడ్డి, జిపి. చంద్రశేఖర్‌శాస్త్రీ, మహిళా విభాగంలో గౌని జ్యోతికిరణ్‌రెడ్డి, గౌతరెడ్డి వనిత రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ విభాగంలో ఎస్ రవి ఎన్నికయ్యారు. ఎన్నికైన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులను కాలనీ ప్రతినిధులు సన్మానించారు.

చాతి నొప్పులపై నిర్లక్ష్యం వహించొద్దు

● కామినేని ఆస్పత్రి కార్డియాలజీ విభాగ వైద్యులు

మన్సూరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చాతిలో వచ్చే నొప్పులను గ్యాస్ట్రిక్ అనుకుని నిర్లక్ష్యం వహించరాదని, గుండె సంబంధిత వ్యాధులు కూడా అయ్యుండే ప్రమాదముందని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. చాతి నొప్పులను చాలా మంది నిర్లక్ష్యంవహిస్తుండడం పట్ల గురువారం ఆస్పత్రి ఆవరణలో అవగాహనపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్‌దేశ్‌ముఖ్ మాట్లాడుతూ గ్యాస్ట్రిక్, గుండె సంబంధిత సమస్యలకు చాతిలో నొప్పి ఒకే రకంగా ఉండడంతో చాలామంది అది ఎలాంటి సమస్యో అవగాహన లేకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. గుండె సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉన్న చాలా వరకు కేసుల్లో మొదట్లో గ్యాస్ట్రిక్ సమస్య అనుకుని నిర్లక్ష్యం చేసినవారే అధికంగా ఉన్నారన్నారు. ఏ మాత్రం చాతిలో నొప్పి వచ్చినా నిర్లక్ష్యం వహించకుండా సమీపంలోని ఆస్పత్రుల్లో గుండె సంబంధిత వ్యాధి నిపుణులను కలిసి వారి సూచనలు, సలహాలు పాటించి గుండెను కాపాడుకోవాలన్నారు. 40 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్కులు మరీ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమావేశంలో కార్డియాలజీ విభాగ వైద్య నిపుణులు డా.ఎ.రవికాంత్, డా.రిషిత్ బత్తిని, డా.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రాజేష్ దేశ్‌ముఖ్



సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

స్వదేశీ జ్ఞానాన్ని పునాదిగా గుర్తించాలి: గవర్నర్

● ఇఫ్లూలో స్వదేశీ, గిరిజన సంఘాల-పరిశోధన పద్ధతులపై అంతర్జాతీయ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్వదేశీ జ్ఞానాన్ని అనుబంధంగా కాకుండా పునాదిగా గుర్తించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ఇంగ్లిష్, విదేశీ భాషల విశ్వవిద్యాలయం(ఇఫ్లూ)లో 'స్వదేశీ/గిరిజన సంఘాలు - పరిశోధన పద్ధతులను పునర్నిర్మించడం' అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. జాతీయ పరిశోధన, విధాన చర్చలలో గిరిజన జ్ఞానం, సంప్రదాయాలు, పర్యావరణ జ్ఞానాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బిర్సా ముండా వంటి నాయకుల వారసత్వాన్ని, భారతదేశ సాంస్కృతిక, పర్యావరణ వారసత్వానికి గిరిజన సమాజాల విస్తృత సహకారాన్ని గుర్తించడంలో ప్రభుత్వం జాతీయ గౌరవ్ దివస్ నిర్వహించడాన్ని స్వాగతించారు. ఇఫ్లూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.నాగరాజు స్థానిక ప్రపంచ దృక్పథాల విద్యా ప్రాముఖ్యతను, విస్తృత పరిశోధన పర్యావరణ వ్యవస్థలో వారికి స్థలాన్ని సృష్టించాల్సిన అవసరాన్ని వివరించారు. సమావేశంలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్, గౌరవ అతిథి ప్రొఫెసర్ దీపక్‌కుమార్ బెహెరా, కీనోట్ స్పీకర్ ప్రొఫెసర్ అమరేశ్వర్ గల్లా, రిజిస్ట్రార్ ఐ/సి ప్రొఫెసర్ హరిప్రసాద్, ప్రొక్టర్ శ్యామ్‌రావు రాథోడ్, స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ సోన్బా ఎం సాల్వే, కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ రాజునాయక్, ఇతర విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధనా పండితులు, బోధనేతర సిబ్బందితో సహా విస్తృత శ్రేణి వక్తలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల డిజైన్లు సొంతంగా రూపొందించండి: కమిషనర్ కర్ణన్



మాట్లాడుతున్న కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల డిజైన్లను సొంతంగా రూపొందించండని, ప్రైవేట్ కన్సల్టెంట్లపై ఆధారపడొద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన హెచ్-సిటీ, ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2 పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఆయా ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూ సేకరణపై సంబంధిత అధికారులతో గురువారం కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ వ్యయం, యుటి లిటీల మార్పులో సవాళ్లు, క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారం, సవాళ్లను అధిగమించేందుకు వారానికి ఒక సారి జోనల్ స్థాయిలో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో జోనల్ కమిషనర్ల సమీక్షా సమావేశం ఉంటుందన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ప్రత్యేక కోర్సులు చదవి, జీహెచ్ఎంసీలో ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తోన్న వారిని గుర్తించి ప్రాజెక్టు డిజైన్‌లో భాగస్వాములను చేయాలని చీఫ్ ఇంజనీర్ (అడ్మిన్)ను ఆదేశించారు.

మాజీ సైనికులకు నగదు రహిత వైద్య సేవలు

● స్పార్స్ హోస్పిస్, రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్‌తో టాసా ఒప్పందం

అల్వాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రాసబ్ ఏరియా (టాసా) రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందించనున్నారు. స్పార్ష్ హోస్పిస్, రోటరీక్లబ్ ఆఫ్ బంజారాహిల్స్‌తో టాసా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం టాసా ప్రధాన కార్యాలయంలో ఎంవోయూ పత్రాలపై మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, బ్రిగేడియర్ రాజీవ్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎంవోయూతో తెలుగు రాష్ట్రాల్లోని 2,80,749 మందికి పైగా ఉన్న మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు వైద్య ఖర్చుల భారం తగ్గుతుందన్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎక్స్-సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్(ఈసీహెచ్ఎస్) లబ్ధిదారులకు నగదు రహిత చికిత్స అందించనున్నట్టు తెలిపారు.